సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
సోమవారం । 8 । సెప్టెంబర్ । 2025



సింగిల్ క్లిక్..బ్యాడ్ లక్!
సైబర్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.. వాట్సాప్‌కు వచ్చిన ఏపీకే ఫైల్ ఓపెన్ చేస్తే క్షణాల్లో ఖాతాలోని నగదు మాయం అవుతోంది. - 8లో ▸



ఉత్సాహంగా బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు - 8లో ▸
హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
31.2⁰ /24.2⁰

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాళేశ్వరాలయం మూసివేత



కాళేశ్వరం: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంతో పాటు అనుబంధ దేవాలయాలను ఆలయ అర్చకులు, అధికారులు (ద్వార బంధనం) మూసివేశారు. సోమవారం (నేడు) ఉదయం సంప్రోక్షణాది పూజా కార్యక్రమాల అనంతరం 7.30 గంటలకు భక్తులను దర్శనాలకు అనుమతించనున్నట్లు ఈఓ మహేష్, ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ తెలిపారు.

హేమాచలుడి ఆలయం..




మంగపేట: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం పూజారులు స్వామి వారి గర్భాలయం, ఉప ఆలయాల్లో ఆదివారం మధ్యాహ్నం నైవేద్యం సమర్పణ అనంతరం ద్వార బంధనం చేసి ఆలయాలను మూసివేసినట్లు ఈఓ రేవెల్లి మహేష్ తెలిపారు. సంపూర్ణ చంద్రగ్రహణం ముగిసిన అనంతరం సోమవారం ఆలయంలో సంప్రోక్షణ పూజా కార్యక్రమాలను నిర్వహించి ఉదయం 9 గంటల నుంచి పూజా కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని వెల్లడించారు. భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని ఈఓ తెలిపారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



ములుగు/ములుగు రూరల్: పెండింగ్‌లో ఉన్న మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికుల మూడు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ ములుగు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ వర్కర్స్, అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కార్మికులను పర్మనెంట్ చేయాలన్నారు. కనీస వేతనాల అమలుతో పాటు 2వ పీఆర్‌సీ ప్రకారం రూ. 26వేలు చెల్లించాలని కోరారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రమాదాలలో మరణించిన కార్మికులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నద్దునూరి సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా మాట్ల జయకర్, కోశాధికారిగా కావటి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా నాంపెల్లి రఘు, ఎంపెల్లి స్వరూప, సహాయ కార్యదర్శులుగా గడ్డం నాగార్జున, దామర రాజు, కమిటీ సభ్యులుగా సాంబయ్య, రఘు, రాజేశ్వరి, మహేష్, బాలు, రాజేష్, పల్లవి, రంజితలను ఎన్నుకున్నారు.

శివాపురం రోడ్డుకు మరమ్మతులు



ఏటూరునాగారం: గోగుపల్లి, శివాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు, ప్రజలు నడిచే పరిస్థితి లేకుండా పోయిందని స్థానిక నాయకులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే రోడ్డుపై కంకర, మిక్స్ కంకర పొడి వేసి మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి.

వరి సాగు సూపర్

జిల్లాలో 1,13,121 ఎకరాల్లో సాగు
- ఇటీవల కురిసిన వర్షాలు అనుకూలం
- కూలీల కొరతతో ఈసారి వెదజల్లే పద్ధతి
- సన్న రకాలవైపే రైతుల మొగ్గు



భూపాలపల్లి: సకాలంలో వర్షాలు కురవకపోయినప్పటికీ జూలై చివరి వారం, ఆగస్టులో కురిసిన వర్షాలకు జిల్లాలో వరిపంట జోరుగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా సాగు ఒకేసారి మొదలవడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో చాలామంది రైతులు ఈ సారి వెదజల్లే పద్ధతిలో వరినాట్లు వేశారు. అయినప్పటికీ పంట ఏపుగా పెరగడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మందకొడిగా ప్రారంభమై..

ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో వర్షాలు సమృద్ధిగా పడలేదు. బోర్లు, బావులు ఉన్న రైతులు సకాలంలో వరిసాగు ప్రారంభించినప్పటికీ వర్షాభావం, జలాశయాల మీద ఆధారపడే వారు సకాలంలో వరినాట్లు వేయలేదు. జూలై చివరి వారం, ఆగస్టులో కురిసిన వర్షాలకు చెరువులు నిండి, వాగులు, వంకలు ఉప్పొంగాయి. దీంతో రైతులంతా ఒక్కసారిగా వరిపంట సాగు చేశారు. గతేడాది సుమారు లక్ష ఎకరాల్లో వరిసాగు జరుగగా, ఈ ఏడాది ఏకంగా 1,13,121 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలు వరిపంటలకు అనుకూలంగా మారాయి. యూరియా కొరత కొంతమేరకు ఉన్నప్పటికీ ప్రస్తుతం వరిపంట ఏపుగా పెరిగింది. భారీ వర్షాలు, వరదలు రాకుంటే ఈ ఏడాది అంచనాకు మించి దిగుబడి అయ్యే అవకాశం ఉంది. అకాల వర్షాల కారణంగా పత్తి, మిర్చి పంటలకు ఇప్పుడిప్పుడే తెగుళ్లు ఆశించి అనుకున్న మేరకు దిగుబడి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. వరిపంట మాత్రం ఏపుగా పెరగడం, ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పత్తి, మిర్చి పంటల్లో వచ్చే నష్టాలను వరితో అధిగమించవచ్చని రైతులు భావిస్తున్నారు.

కూలీల కొరతతో వెదజల్లే పద్ధతి..

వర్షాలు సకాలంలో కురవకపోవడం, ఒకేసారి రైతులంతా నాట్లు వేయాల్సిన పరిస్థితి రావడంతో జిల్లాలో కూలీల కొరత ఏర్పడింది. దీంతో కాటారం డివిజన్‌లోని కాటారం, మహదేవపూర్, పలిమెల మండలాలకు చెందిన రైతులు గతంలో పక్కనున్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కూలీలను పిలిపించుకొని వరినాట్లు వేయించేవారు. ఈసారి అక్కడి నుంచి సైతం కూలీలు రాలేదు. రోజువారి కూలి పెరగడం, కొరత కారణంగా కాటారం డివిజన్, భూపాలపల్లి నియోజకవర్గంలోని వందలాది మంది రైతులు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేశారు. తట్టు సంచిలో వడ్లను రెండు రోజుల పాటు నానబెట్టి చిన్నగా మొలకెత్తాక పంట పొలాల్లో వెదజల్లారు. ఈ పద్ధతిలో సైతం వరిపైరు ఏపుగా పెరిగింది. దీంతో వచ్చే ఏడాది ఇదే తరహాలో మరింత సాగు పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలో వరిసాగు వివరాలు (ఎకరాల్లో)...

మండలం	వెదజల్లే పద్ధతిలో సాగు	నాట్లు వేసే పద్ధతిలో
భూపాలపల్లి	563	11,358
గణపురం	200	10,000
రేగొండ	225	7,325
కొత్తపల్లిగోరి	30	5,640
చిట్యాల	110	6,100
టేకుమట్ల	120	7,700
మొగుళ్లపల్లి	80	8,770
మహదేవపూర్	650	7,300
పలిమెల	450	2,500
కాటారం	3,000	9,500
మల్హర్	5,500	10,500
మహాముత్తారం	3,000	12,500
మొత్తం	13,928	99,193

వరిసాగు బాగుంది..



వర్షాలు సకాలంలో కురవకపోయినప్పటికీ జూలై, ఆగస్టు మాసాల్లో కురిసిన వర్షాలు వరిపంటలకు అనుకూలంగా మారాయి. ఈ సారి జిల్లాలో అంచనా మేరకు వరిపంట సాగు జరుగుతోంది. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో వస్తుంది. వరిసాగులో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేదు.

- బాబురావు, ఇన్‌చార్జ్ జిల్లా వ్యవసాయశాఖాధికారి

పరీవాహక ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి..

ఇటీవల కురిసిన వర్షాలు నది, వాగుల పరీవాహక ప్రాంతాల్లో వరిసాగు చేసిన రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. భూపాలపల్లి నియోజకవర్గంలోని మోరంచవాగు, చలివాగు, కాటారం డివిజన్‌లోని గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు వరిపంటలు పూర్తిగా నీట మునిగాయి. వరదల మూలంగా పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. మరికొన్ని పొలాలు నీట మునిగి దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో ముంపు ప్రాంతాల్లోని రైతులు మాత్రం దిగుబడిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

రేగొండ: ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రూ.10 లక్షలతో నిర్మించిన కోటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ స్వాగత తోరణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తుల సౌకర్యార్థం కోటంచలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భక్తుల సహాయంతో ఆలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేష్, చైర్మన్ భిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, నాయకులు సంపత్‌రావు, పున్నం రవి, పట్టెం శంకర్, సాంబయ్య, రవీందర్ రెడ్డి, వీరబ్రహ్మం, ప్రమదాదేవి పాల్గొన్నారు.

జిల్లాకు మధ్యప్రదేశ్ మద్యం

- విచ్చలవిడిగా విక్రయాలు



మధ్యప్రదేశ్‌కు చెందిన మద్యం బాటిల్



లేబుళ్లు తీసేసిన మధ్యప్రదేశ్ మద్యం

భూపాలపల్లి: మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మద్యం విక్రయాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. కొందరు వ్యక్తులు మద్యాన్ని తీసుకొచ్చి విక్రయాలు జరుపుతున్నారు. మన రాష్ట్రంలో కంటే తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో మందుబాబులు, బెల్ట్ షాపుల నిర్వాహకులు విచ్చలవిడిగా కొనుగోలు చేస్తున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(జీరో మద్యం) విక్రయాలు జరుపకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వ్యక్తులు అక్కడి నుంచి తీసుకొని వచ్చి గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేస్తున్నారు. మద్యం ధరలు మధ్యప్రదేశ్‌లో కూడా దాదాపుగా ఇక్కడి మాదిరిగానే ఉన్నప్పటికీ తక్కువ ధరకు ఎలా విక్రయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడి నుంచి మద్యం తీసుకొని వచ్చి లేబుల్‌లు తొలగించి, కల్తీచేసిన అనంతరం తక్కువ ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శనివారం భూపాలపల్లి ఎక్సైజ్ అధికారులు ఒక వ్యక్తిని పట్టుకొని 20.25 లీటర్ల నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కాగా అప్పటికే పెద్దమొత్తంలో మద్యం దిగుమతి, విక్రయాలు జరిగినట్లుగా తెలుస్తోంది.

టేకుమట్ల-చిట్యాల ప్రధాన రోడ్డులో పచ్చని చెట్లు



పచ్చదనం పరుచుకుంది..

2017లో హరితహారంలో భాగంగా టేకుమట్ల మండల కేంద్రం నుంచి చిట్యాల మండలం, శాంతినగర్ వరకు నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా ఎదిగి పచ్చదనాన్ని పరిచినట్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. వానాకాలం కావడంతో ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు పచ్చని వర్ణంలో ఎంతో శోభాయమానంగా మారాయి. - టేకుమట్ల

కాళేశ్వరంలో బాలకవి సమ్మేళనం



బాలకవులతో ఉపాధ్యాయులు

కాళేశ్వరం: తెలంగాణ భాషా దినోత్సవం (కాళోజీ జయంతి) పురస్కరించుకొని పీఎం శ్రీ కాళేశ్వరం పాఠశాలలో ఆదివారం 'బాలకవి సమ్మేళనం' నిర్వహించారు. కాళేశ్వరం, మహదేవపూర్ పాఠశాల బాల బాలికలు కవితా పఠనం కార్యక్రమం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం దొనికల రాజేందర్ అధ్యక్షతన జరిగింది. 20 మంది బాల కవులతో పాటు 20 మంది కాళేశ్వరం పాఖాల కవులు పాల్గొని తెలుగు భాష, తెలంగాణ నుడికారం, పలుకు బడుల సోయగం, కాళోజీ ఔన్నత్యాన్ని కవితలతో అక్షరాంజలి సమర్పించారు. బాల కవులు విద్య, అక్షయ, జ్యోతిక, తన్మయి, తరుణ, సంయుక్త ఉత్తమ ప్రదర్శనతో సభను రంజింపచేశారు. హెచ్‌ఎం రాజేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనే ఆకాంక్షతో పాఠశాలలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథి మాడుగుల భాస్కరశర్మ మాట్లాడుతూ కవి సమ్మేళనం గొప్ప కార్యక్రమన్నారు. సాహిత్య కార్యక్రమాలకు తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళేశ్వరానికి చెందిన కవులు మాడుగుల భాస్కరశర్మ, నారాయణమూర్తి, శ్రీనివాస శర్మ, రామగుండం రామ్మూర్తి, ఉపాధ్యాయులు మడక మధు, జ్యోతి, శ్రీధర్, శ్యామ్, బండారి రాజ్ కుమార్‌లతో పాటు తండా హరీశ్‌గౌడ్, రహీమొద్దీన్, గన్నోజు ప్రసాద్, చిట్ల ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

తండ్రిపై కొడుకు హత్యాయత్నం

భూపాలపల్లి అర్బన్: తండ్రిపై కొడుకు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్ కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కారల్ మార్క్స్ కాలనీకి చెందిన మంగళపల్లి నర్సింగమూరితో అతని కుమారుడు కార్తీక్‌కు మధ్యాహ్న సమయంలో గొడవ జరిగింది. కోపంతో పక్కన ఉన్న కత్తెరతో నర్సింగమూర్తిపై కార్తీక్ దాడిచేశాడు. దీంతో దవడకు తీవ్ర గాయమైంది. బాధితుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

భక్తుల భద్రతకు చర్యలేవి?

- జంపన్నవాగులో ప్రవహిస్తున్న వరద
- హెచ్చరిక బోర్డులు కరువు
- పట్టించుకోని అధికారులు



జంపన్నవాగు వరదలో స్నానాలు చేస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: ఇటీవల జోరుగా వర్షాలు కురవడంతో మేడారం జంపన్నవాగులో వరద ప్రవాహం కొనసాగుతోంది. మొన్నటి వరకు ఇసుక దిబ్బలతో కనిపించగా నేడు నీటితో కళకళలాడుతోంది. దీంతో తొలుత స్నానఘట్టాలపై ఉన్న షవర్ కింద పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ప్రస్తుతం వాగులోనే స్నానాలు చేస్తున్నారు. వరద ఉధృతితో వాగులో భక్తులు ప్రమాదాల బారిన పడకుండా నివారణ చర్యలు తీసుకోవాలని మేడారం దేవాదాయశాఖ అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం తాజాగా అమ్మవార్ల దర్శనానికి వచ్చిన జనగామకు చెందిన కనికంటి మనీష్ జంపన్నవాగులో స్నానం చేసేందుకు వెళ్లి గల్లంతై మృత్యువాత పడ్డాడు. ఇలాంటి ఘటనలు ప్రతిఏటా వర్షాకాలంలో చోటు చేసుకుంటున్నాయి.

ప్రమాదాల నివారణకు చర్యలు నిల్..

మేడారం వచ్చిన భక్తులు చాలా మంది జంపన్న వాగు నీటిలో పుణ్యస్నానాలు చేస్తేనే మంచిదని విశ్వసిస్తారు. వాగు వరద సమాంతరంగా వెళ్లడంతో స్నానాలకు వెళ్లిన భక్తులకు నీటి లోతు తెలియకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. గతంలో భక్తులు నీట మునిగి మృత్యువాత పడిన విషాద ఘటనలు ఉన్నాయి.

హెచ్చరిక బోర్డులతో నివారణ

జంపన్నవాగులో నీటి ప్రవాహం, ప్రమాదభరితంగా ఉన్న స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చు. ప్రస్తుతం రెడ్డిగూడెం లోలెవల్ కాజ్‌వే వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. మేడారానికి వచ్చిన భక్తులు చాలా మంది ఈ-కాజ్‌వే వద్ద నీటి ప్రదేశంలో ఎక్కువగా స్నానాలు చేస్తుంటారు. కాజ్‌వే కింద వాగులో నీరు కూడా సమృద్ధిగా ఉండడంతో భక్తులు స్నానాలు చేస్తుంటారు. కానీ లోతు కూడా భారీగానే ఉంటుంది. ఈ-కాజ్‌వే ప్రాంతంలో గతంలో పదుల సంఖ్యలో భక్తులు నీటమునిగి మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఈ లోలెవల్ కాజ్‌వే వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. అలాగే ఊరట్టం జంపన్న వాగు వద్ద కాజ్‌వే ధ్వంసమైన ప్రదేశంలో కూడా నీటి లభ్యత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ కూడా భక్తులు స్నానాలు చేస్తుంటారు. గత మూడేళ్ల క్రితం వర్షాకాలంలో ఇద్దరు భక్తులు ఒకేసారి నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. అలాగే జంపన్నవాగు వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తే పుణ్యస్నానాలు చేసే భక్తులకు సూచనలు చేయడంతో పాటు ప్రమాదవశాత్తు నీటమునిగిన భక్తులను కాపాడే అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

'డబుల్'.. ఎన్నాళ్లీ ట్రబుల్!

రెండు పడకల గదుల ఇళ్లకు మోక్షం ఎప్పుడు?
- మంజూరైన ఇళ్లలో పూర్తయినవి 41.62 శాతమే
- పూర్తయిన ఇళ్లలో పంపిణీ చేసింది 44.56 శాతం
- చాలాచోట్ల శిథిలావస్థకు గృహాలు
- వివిధ స్థాయిల్లో నిలిచినవి 11,245.. ఆ నిర్మాణాలపై నీలినీడలు
- నెరవేరని పేదోళ్ల సొంతింటి కల.. 'ఇందిరమ్మ'పై అర్హుల ఆశలు



వరంగల్ తూర్పు నియోజకవర్గం దూపకుంటలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

సాక్షిప్రతినిధి, వరంగల్:

- హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో 790 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 520 ఇళ్లు నిర్మించారు. మర్రిపల్లిగూడెం, గూడూరులో 50 చొప్పున 100 ఇళ్లు, కమలాపూర్‌లో 320 నిర్మించారు. రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్, వాటర్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో కొద్ది రోజులు కాలయాపన జరిగింది. ఇప్పటికీ లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేయకపోవడంతో ఇళ్లు నిరుపయోగంగానే ఉన్నాయి.
- మహబూబాబాద్ జిల్లాలో 5,567 ఇళ్ల నిర్మాణం చేపట్టగా.. 2024 వరకు 2,503 మాత్రమే పూర్తయ్యాయి. అందులో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి 1,256 మందికి పంపిణీ చేశారు. ఇంకా 3,064 ఇండ్లు వివిధ స్థాయిల్లో ఉండగా.. పూర్తయిన 2,503 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇంకా 1,247 లబ్ధిదారులకు అందజేయడంలో కాలయాపన జరుగుతోంది.

.. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ పథకానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో మోక్షం కలగడం లేదు. నిర్మాణాలు పూర్తయినా ఇళ్లపంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఫలితంగా మూడేళ్ల కిందట పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వివిధ స్థాయిల్లో నిలిచిపోయిన నిర్మాణాల్లో గడ్డి, ముళ్లపొదలు ఏర్పడ్డాయి. పంపిణీ చేసిన వాటిలో సరైన మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకాశం రాక అర్హులైన వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, పూర్తయిన వాటిని పంపిణీ చేయాలన్న డిమాండ్ వస్తుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవకాశం రాని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

నెరవేరని సొంతింటి కల...

పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని అమలు చేసింది. ఉమ్మడి వరంగల్‌లో ఈ పథకం కింద రెండు విడతల్లో 26,284 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో అధికారులు చెబుతున్న ప్రకారం సుమారు రూ.860 కోట్ల వరకు ఖర్చు చేసి 10,939 (41.62 శాతం) ఇళ్లు పూర్తి చేశారు. అందులో నుంచి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి 4,874 (44.56 శాతం) రెండు పకడల గదుల ఇళ్లను పంపిణీ చేశారు. ఇదిలా ఉండగా మంజూరైన మొత్తం 26,284లలో 4100 వరకు వివిధ కారణాలతో నిర్మాణాలు మొదలు పెట్టలేదు. నిర్మాణాలు ప్రారంభించిన 22,184 ఇళ్లలో 10,939 పూర్తయ్యాయి. 11,245 ఇళ్లు వివిధ స్థాయిల్లో నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల కొన్నేళ్ల క్రితం చేపట్టిన ఈ ఇళ్ల నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. పూర్తయిన 10,939 ఇళ్లలో 4,874 ఇళ్లు మాత్రమే పంపిణీ చేశారు. 6,065 ఇళ్ల మంజూరులో జాప్యం జరుగుతుండడంతో ఉండడానికి గూడులేక వేలాది మంది నిరుపేదలు ఏళ్ల పాటు గుడిసెల్లో జీవిస్తూ పక్కా ఇళ్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌కు మంజూరైన ఇళ్లు (రెండు విడతలు)	26,284
నిర్మాణం పూర్తయినవి	10,939 (41.62 శాతం)
నిర్మాణానికి చేసిన ఖర్చు (సుమారుగా)	రూ.860 కోట్లు
అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసినవి	4,874 (44.56 శాతం)

మంజూరు నుంచి పంపిణీ వరకు అవాంతరాలే..

జిల్లా	మంజూరు	పూర్తి	పంపిణీ
హనుమకొండ	4,326	2,143	1,200
వరంగల్	6,350	2,350	1,250
జేఎస్ భూపాలపల్లి	3,882	1,615	710
జనగామ	4,400	1,600	750
ములుగు	1,800	950	300

ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నాం..



ఇళ్లు లేక అద్దెకు ఉంటున్నాం. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఆరేళ్లుగా ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఎప్పుడెప్పుడు ఇస్తుందా అని ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం స్పందించి దసరా పర్వదినానికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేయాలి.

- దుమాల పద్మ, మార్కండేయ నగర్, వరంగల్

దసరా నాటికి ఇవ్వాలి..



ఐదేళ్ల క్రితం డబుల్‌బెడ్రూం ఇళ్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాం. పేదరికంతో జీవనం సాగిస్తున్నాం. ఇంటికి అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్నాం. నాటి నుంచి నేటి వరకు ఇల్లు కోసం ఎదురు చూస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం దసరాకు డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తుందని ఆశిస్తున్నాం.

- సుంకరి భవాని, వరంగల్

క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు 12

విద్యారణ్యపురి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరం డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ వరకు గడువు ఉందని ఆ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఆదివారం ఒకప్రకటనలో తెలిపారు. ఇంటర్ రెండేళ్లు, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ ,10ప్లస్2, పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందచ్చని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆసక్తి కలిగినవారు డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఆన్‌లైన్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఎంపిక చేసుకున్న స్టడీ సెంటర్‌ను సంప్రదించి వైరిఫై చేయించుకున్న తర్వాత ట్యూషన్ ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్‌లో చూడాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు



ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో బాల్‌బ్యాడ్మింటన్ సంఘం బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సబ్‌జూనియర్ బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్రీడాకారులు ఎంపికల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి. వీరన్న తెలిపారు. జనగామ జిల్లా కూనూరులో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రకుమార్, ప్రొఫెసర్ స్వామి, సుదర్శన్, మల్లారెడ్డి, ప్రసాద్‌రావు, రవి పాల్గొన్నారు.

తల్లీబిడ్డను కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది

వరంగల్ చౌరస్తా : కుటుంబ కలహాలతో వరంగల్ కాశిబుగ్గకు చెందిన మధులత తన కుమారుడిని వెంట తీసుకుని ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్లింది. దీనిపై డయల్ 100కు సమాచారం అందడంతో అప్రమత్తమైన బ్లూ కోల్ట్స్ సిబ్బంది కుమారస్వామి, ప్రశాంతి.. తల్లీబిడ్డలను కాపాడి ఇంతేజార్‌గంజ్ సీఐ షుకుర్‌కు అప్పగించారు. దీనిపై బ్లూ కోల్ట్స్ సిబ్బంది కుమారస్వామి, ప్రశాంతి సేవలను పలువురు కొనియాడారు.

యూరియా.. ఆగయా

ఖిలా వరంగల్ : వరంగల్ రైల్వే స్టేషన్ గూడ్స్ షెడ్‌కు ఆదివారం ఇఫ్కో కంపెనీ ఎరువులు చేరుకున్నాయి. 20.20.13 రకం 1,905.750 మెట్రిక్ టన్నులు, డీఏపీ 900.000 మెట్రిక్ టన్నులు చేరుకోగా మండల వ్యవసాయ అధికారులు విజ్ఞాన్, రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ ఎరువులను మార్క్‌ఫెడ్‌కు 60శాతం, ప్రైవేట్ ఫర్టిలైజర్ డీలర్లకు 40శాతం కేటాయించారు. సోమవారం ఉదయంలోపు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సొసైటీలు, ఫర్టిలైజర్ షాపులకు ఎరువులు చేరవేసే కార్యక్రమం చేపట్టామని మండల వ్యవసాయ అధికారులు రవీందర్‌రెడ్డి, విజ్ఞాన్ తెలిపారు.

సింగిల్ క్లిక్.. బ్యాడ్ లక్!

సైబర్ క్రైమ్‌తో తస్మాత్ జాగ్రత్త!

- గోల్డెన్ అవర్.. బాధితులకు వరం
- ఉన్నత విద్యావంతులే బాధితులు
- పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- సీసీపీఎస్‌లో 56 కేసులు నమోదు

వరంగల్ క్రైం: కాలు కదపకుండా.. చెమట చుక్క రాల్చకుండా.. కూర్చున్న చోటు నుంచే కోట్లు దోచేస్తున్న కేటుగాళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. అందమైన ఫొటోలు.. తియ్యటి పిలుపుతో ఫోన్‌లో మాట్లాడి మైమరపించి.. ఆతర్వాత జేబు ఖాళీ చేస్తున్నారు. ఎక్కడుంటారో.. ఎంత మంది ఉంటారో ఎవరికీ తెలియదు. కానీ, క్షణాల్లో కోట్లు కొట్టేసి ఖాతా ఖాళీ చేసేస్తారు. నిత్యం సైబర్ క్రైమ్‌పై పోలీస్ శాఖ ప్రజలను చైతన్యం చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం ఫోన్‌లో పదే పదే హెచ్చరిస్తున్నా.. ప్రజల్లో చలనం లేకుండా పోతోంది. దేశవ్యాప్తంగా నిమిషానికి పదుల సంఖ్యలో సైబర్ మోసాలు దాటుతున్నాయంటే మోసాలు ఏ స్థాయిలో సాగుతున్నాయో తెలిసిపోతుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బృందాలు నిరంతరం నిఘా పెడుతున్నా.. సైబర్ నేరస్తులను పట్టుకోలేకపోతున్నారు. మోసాల తీరు మారడంతో బాధితులు పెరిగిపోతున్నారు. సైబర్ నేరాలపై అవగాహన ఉంటే తప్ప తప్పించుకునే పరిస్థితులు కనబడట్లేదు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటైన సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసుల సంఖ్య నిత్యం పెరిగిపోతోంది. సైబర్ ఫిర్యాదులు నేషనల్ క్రైమ్ రికార్డ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)కి సుమారు 2,000 ఫిర్యాదులు అందాయి.

విద్యావంతులే బాధితులు..

సమాజంలో పలుకుబడి ఉన్న వ్యక్తులు, ఉన్నత విద్యావంతులు, ఉద్యోగస్తులు, ఆర్థికంగా బలంగా ఉన్నవారు, హై ప్రొఫైల్ కలిగిన వాళ్లే సైబర్ మోసగాళ్ల టార్గెట్. సైబర్ నేరగాళ్లు వినియోగించే చిన్న చిన్న చిట్కాలకే వారంతా వలలో చిక్కుతున్నారు. మోసపోయిన తర్వాత నెత్తీనోరు కొట్టుకుంటున్నా.. ప్రయోజనం లేకుండా పోతోంది.

అవగాహన లేకపోతే.. అంతే సంగతి

సైబర్ నేరాలపై అవగాహన లేకపోతే నేరం ఏ రూపంలో ఎవ్వరికి చుట్టుకుంటుందో తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ఎవరైనా చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్ (సీఎస్ఏఎం) 16 ఏళ్లలోపు బాలికలకు సంబంధించి న్యూడ్ ఫొటోలు, వీడియోలు తీసినా, ఎవరికైనా పంపినా.. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా, సోషల్ మీడియాలో పెట్టిన వారికి సంబంధం లేకుండానే వారి వివరాలు మెటా ప్లాట్‌ఫాం ద్వారా ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా టిప్‌లైన్ రిపోర్ట్ స్థానిక పోలీసులకు చేరుతుంది. దీంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వ్యక్తుల చిరునామాతో.. వారికి తెలియకుండానే వారిని పోలీసులు అరెస్టు చేస్తారు. ఇలాంటి కేసులు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈఏడాది 70 నుంచి 80 వరకు నమోదయ్యాయి.

పోయింది కొండంత.. దొరికింది రవ్వంత

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో 56 కేసులు నమోదయ్యాయి. ఇందులో బాధితులు రూ.16.24 కోట్లు పోగొట్టుకున్నారు. వారి ఫిర్యాదు తర్వాత నేరస్తుల ఖాతాలను పుట్ ఆన్ హోల్డ్ చేయడం ద్వారా రూ.1.54 కోట్లు ఆగిపోయాయి. కాగా.. 37 కేసుల్లో ఇప్పటికే బాధితులకు కోర్టు ద్వారా చెల్లించిన నగదు రూ.67.25 లక్షలు. బాధితులు సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయినట్లు అనుమానం వచ్చిన గంట వ్యవధి (గోల్డెన్ అవర్)లో ఫిర్యాదు చేస్తే మరింత లాభం ఉంటుంది.

ఇటీవల వెలుగుచూసిన మోసాల్లో కొన్ని..



- జనగామ జిల్లాకు చెందిన ఓ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ భార్య ఇంట్లో ఖాళీగా ఉండకుండా ఆన్‌లైన్‌లో వ్యాపారం చేయాలనుకుంది. దీంతో ఆన్‌లైన్‌లో వెతుకుతుంటే.. 'ఇంట్లో కూర్చుని సంపాదించండి' అనే ప్రకటన ఆమెను ఆకర్షించింది. దీంతో సైబర్ నేరస్తులు చెప్పినట్లుగా మొదట రూ.10 వేలు పంపింది. అనంతరం వారు చెప్పే మాటలను నమ్ముతూ రూ.38 లక్షల వరకు పెట్టుబడి పెట్టి మోసపోయింది.
- కాకతీయ యూనివర్సిటి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రిటైర్డ్ ప్రొఫెసర్‌కు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. మిమ్మల్ని ముంబాయి హవాలా కేసులో డిజిటల్ అరెస్ట్ చేస్తున్నట్లు బెదిరించారు. దీంతో సదరు ప్రొఫెసర్ భయపడి సైబర్ నేరగాళ్లు చెప్పినట్లుగానే రూ.91.93 లక్షలు వారు చెప్పిన ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడు.
- రిటైర్డ్ డీఎస్పీ తనయుడికి తెలియని నంబర్ నుంచి ఓ రోజు ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్‌లో అవతలి వ్యక్తి ప్రొఫైల్ ఫొటో మతిపోగొట్టేలా ఉంది. ఫోన్ ఎత్తగానే తేనెలాంటి తియ్యటి గొంతు.. మీతో మాట్లాడవచ్చా? అంటూ మాటలు కలిపింది. వీడియో కాల్‌లో ఒకరిని ఒకరు చూసుకున్నారు. పెళ్లికాని ఆ యువకుడు ఆమె మాటలకు పూర్తిగా మునిగిపోయాడు. కట్ చేస్తే అతడి ఖాతా నుంచి రూ.18 లక్షల నగదును ఆమె ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. ఇలా హనీ ట్రాప్‌లో అనేకమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు చిక్కుకున్నారు.
- వాట్సాప్‌లో వచ్చిన ఒక ఏపీకే ఫైల్ ఓపెన్ చేసిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఆన్‌లైన్ పెట్టుబడికి సంబంధించిన ఆహ్వానం కనిపించింది. ఆ ప్రకటనతో తన జీవితం మారిపోతుందనుకొని పెళ్లి చేసుకుంటే వచ్చిన కట్నం, బంగారం ఇలా అన్ని పెట్టి సుమారుగా రూ.35 లక్షల పెట్టుబడి పెట్టి చివరకు మోసపోయాడు.

సీసీపీఎస్‌లో ఫిర్యాదులు ఇలా..

నెల	ఫైనాన్స్ కేసులు	నాన్ ఫైనాన్స్	ఎఫ్ఐఆర్‌లు
జనవరి	13	0	13
ఫిబ్రవరి	4	0	4
మార్చి	5	3	8
ఏప్రిల్	0	1	1
మే	2	0	2
జూన్	9	1	10
జూలై	10	0	10
ఆగస్టు	7	1	8
మొత్తం	50	6	56

అవగాహనే ఆయుధం



సైబర్ మోసాలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలి. చాలా మంది చదువుకున్న వారే మోసపోతున్నారు. ఎవరైనా తెలిసిన వ్యక్తులు డబ్బులడిగితే ప్రొఫైల్ ఫొటో చూసి మోసపోవద్దు. ఫోన్ నంబర్ చెక్ చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో పెట్టుబడి పేరుతో ఆహ్వానాలు వస్తే నమ్మొద్దు. ఒకే రోజు వేల రూపాయలు ఏ వ్యాపారంలో రావు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్లు ఎత్తకుండా, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేయకుంటే నష్టం ఉండదు. మోసపోయిన వెంటనే టోల్‌ఫ్రీ 1930 నంబర్‌కు ఫోన్ చేసి పోగొట్టుకున్న నగదును పుట్ అన్‌హోల్డ్ చేసే అవకాశం ఉంది. సోషల్ మీడియా పరిచయాలతో ప్రమాదం ఉంటుంది. కాబట్టి తస్మాత్ జాగ్రత్త

– కలకోటి గిరికుమార్, ఏసీపీ, సైబర్ క్రైమ్

సామాజిక చైతన్యమూర్తి రజిత..

- రజిత యాదిసభలో సాహిత్య, సామాజిక సంస్థల బాధ్యులు



రజిత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

కేయూ క్యాంపస్: అక్షరమే జీవితంగా సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు తన రచనలద్వారా సామాజికంగా చైతన్యం కలిగించిన రచయిత్రి అనిశెట్టి రజిత అని వివిధ సాహిత్య ప్రజాసంఘాల, సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు అన్నారు. హనుమకొండకు చెందిన ప్రముఖ రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రీల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజిత యాదిసభను ఆదివారం కేయూలోని కామర్స్ అండ్ బిజినెస్‌మేనేజ్‌మెంట్ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. వరంగల్ సాహిత్య సామాజిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యాదిసభలో పలువురు వక్తలు మాట్లాడుతూ రజిత హేతువాదిగా, స్త్రీ వాదిగా, ఉద్యమకారిణిగా చేసిన పోరాటం ఎందరికో అనుసరణీయమన్నారు.అంతేకాకుండా మరణాంతరం కాకతీయ మెడికల్‌కాలేజీకి అవయవశరీరందానం చేసి కాళోజీ బాటలో నడిచారని కొనియాడారు. యాదిసభలో నిర్వాహకులు కన్వీనర్ బూర భిక్షపతి, బిల్ల మహేందర్, నిధి, కొమ్రరాజు రామలక్ష్మి, డాక్టర్ శంకర్‌నారాయణ, ఉద్యమమిత్రులు తిరునగరి దేవకిదేవి, పల్లేరు వీరస్వామి, మెట్టు రవీందర్, డాక్టర్ చంద్రబాను, కె. కుమారస్వామి, జూపాక సుభద్ర, బి.రమాదేవి,అంజనీదేవి, శైలజ, విద్యాదేవి, సుమిత్రదేవి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, బండారి సుజాత, కల్యాణి, వెంగల్‌రెడ్డి,శంకర్‌రావు, పిట్ల సాంబయ్య, దండే రాజమౌళి, శోభారమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్, మెస్ కోసం రెన్యువల్ చేసుకోవాలి



కేయూ క్యాంపస్: కేయూలో ఈ విద్యాసంవత్సరం హాస్టల్, మెస్ కోసం విద్యార్థులు రెన్యువల్ చేసుకునేందుకు ఈ నెల 9వ తేదీ వరకు మాత్రమే చివరి గడువు ఉంది. రెన్యువల్ చేసుకునేందుకు హాస్టళ్ల డైరెక్టర్ ఎల్పీ రాజ్‌కుమార్ ఇచ్చిన గడువు ముగిసింది. 79 మంది మాత్రమే విద్యార్థులు రెన్యువల్ చేసుకున్నారు. ఫీజు తగ్గించాలని విద్యార్థులు ఆందోళన చేయడంతో అధికారులు రూ.వెయ్యి నుంచి రూ.500 తగ్గించారు. దీంతో రెన్యువల్ చేసుకున్న రసీదు, ఇప్పటి వరకు వినియోగిస్తున్న ఒరిజినల్ మెస్‌కార్డును క్యాంపస్‌లోని హాస్టల్ ఆఫీస్‌లో సమర్పించిన విద్యార్థులకు కొత్తగా మెస్‌కార్డులు జారీచేస్తున్నారు. తక్కువ మంది రెన్యువల్ చేసుకోవడంతో ఇంకా గదులను విద్యార్థులకు కేటాయించలేదు. వసతి, మెస్ సౌకర్యం మాత్రం ప్రస్తుతం యథావిధిగా పొందుతున్నారు. విద్యార్థులు గడువులోగా ఆన్‌లైన్‌లో రూ.500 ఫీజు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ ఆదివారం తెలిపారు. రెన్యువల్ చేసుకోని విద్యార్థులకు హాస్టల్ వసతి, మెస్ సదుపాయం ఉండదని పేర్కొన్నారు.

ఆకాశంలో అద్భుతం..



ఆకాశంలో ఆదివారం రాత్రి అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. రాత్రి 9:56 నుంచి 10:56 గంటల వరకు ఏర్పడిన చంద్రగ్రహణాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కాగా, అర్ధరాత్రి దాటిన తర్వాత 2.25 గంటలకు చంద్రగ్రహణం వీడింది.

– సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ హనుమకొండ

నీళ్లులేని చెరువుల్లోనే నిమజ్జనాలు



పీచరలోని జంగంకుంట చెరువులో ఉన్న కొద్ది నీటిలోనే నిమజ్జనమైన వినాయక విగ్రహాలు

వేలేరు: హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో ఈ ఏడాది సరైన వర్షాలు కురవ లేదు. చెరువులు, కుంటల్లోకి నీళ్లు రాలేదు. ఆయా గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను నీళ్లు లేని చెరువుల్లోనే నిమజ్జనం చేశారు. ప్రతీ సంవత్సరం ఈ సమయానికి చెరువులు నిండుకుండలా ఉండేవి. ఈసారి చెరువుల్లో నీళ్ల లేక కరువు ఏర్పడింది. పీచరలోని జంగంకుంటలో నీళ్ల లేకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటిలోనే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

యువకుడి ఆత్మహత్య



నవీన్(ఫైల్)

సంగెం: మద్యం మత్తులో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కాపులకనిపర్తిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మారెపెల్లి నవీన్(30)కు పదేళ్ల క్రితం రమ్యతో పెళ్లి జరిగింది. అయితే నవీన్ మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా నిత్యం గొడవ పడుతుండేవాడు. దీంతో విసిగివేసారిన రమ్య మూడేళ్ల క్రితం తన పిల్లలను తీసుకుని తల్లిగారింటికి వెళ్లి అక్కడే ఉంటోంది. ఈ నెల 6వతేదీన ఎప్పటిలాగా నవీన్ మద్యం మత్తులో చనిపోతానని బెదిరించాడు. గతంలో కూడా పలుమార్లు ఇలాగే బెదిరించాడని కుటుంబసభ్యులు భావించి ఇంటిబయట ఉన్నారు. కొద్ది సమయం తర్వాత ఇంట్లో ఎలాంటి అలికిడి వినిపించకపోవడంతో తల్లి స్వరూప వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో తల్లి కేకలు వేయగా చుట్టుపక్కలవారు వచ్చి నవీన్‌ను కిందకు దింపారు. వెంటనే 108కు కాల్ చేయగా సిబ్బంది వచ్చి నవీన్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఇనుగుర్తిలో యువతి..

కేసముద్రం: గడ్డిమందు తాగి ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఇనుగుర్తిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి ఓ యువతి శనివారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. కాగా, సదరు యువతి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావడంలేదు.

యువతిపై లైంగికదాడికి యత్నం

గూడూరు: మండలంలోని కొల్లాపురం శివారు ఇప్పల్‌తండాలో శుక్రవారం రాత్రి ఓ యువకుడు.. యువతిపై లైంగికదాడికి యత్నించి పరారయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇప్పల్‌తండాకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థిని ఆరోగ్యం బాగా లేక ఇంటి వద్దే ఉంటోంది. రాత్రి గ్రామంలో గణపతి నిమజ్జన వేడుకలు జరుగుతుండగా తల్లిదండ్రులు వెళ్లారు. అదే అదునుగా భావించిన సదరు యువకుడు.. యువతిపై లైంగికదాడికి యత్నించగా కేకలు వేసింది. ఈ కేకలు విని యువతి తండ్రి వస్తుండగా ఆ యువకుడు పరారయ్యాడు. దీంతో ఆదివారం అతడి కోసం గాలించి ఆ యువకుడి ఇంటికి తాళం వేశారు. దీనిపై భయభ్రాంతులకు గురైన నిందితుడి కుటుంబీకులు డయల్ 100 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందించారు. పోలీసులు వారితో మాట్లాడి, నిందితుడి ఇల్లు తాళం తీయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్య ఘటనలో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణకిశోర్

మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం సమీపంలో ఓ మహిళను దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మరిపెడ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మరిపెడ మండలం ఉల్లెపల్లికి చెందిన బంటు వెంకటమ్మ(55) వ్యవసాయ కూలి మేస్త్రీగా జీవనం కొనసాగిస్తుంది. ఈ నేపథ్యంలో ఆమెకు సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ సాగల వీరన్నతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో వీరన్నకు మృతురాలు అప్పుడప్పుడు అప్పు ఇచ్చేది. ఈ క్రమంలో గత నెల ఆగస్టు 31వ తేదీన తనకు అప్పు కావాలంటూ వీరన్న.. మృతురాలికి ఫోన్ చేసి మరిపెడకు రాగా ఇద్దరు కలుసుకున్నారు. అనంతరం మద్యం కొనుగోలు చేసి పురుషోత్తమాయగూడెం శివారుకు వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత వీరన్న డబ్బులు అడిగాడు. అయితే మృతురాలు తన దగ్గర లేవని చెప్పింది. దీంతో వీరన్న.. ఆమె శరీరంపై ఉన్న నగలు బలవంతంగా లాక్కొంటుండగా ప్రతిఘటించింది. ఈ క్రమంలో మద్యం సీసాతో ఆమె ముఖంపై దాడి చేశాడు. అనంతరం గొంతు నులిమి హత మార్చి పక్కన ఉన్న నీటిగుంటలో పడేశాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో కేవలం వారం రోజుల్లోనే కేసును ఛేదించారు. నిందితుడి దగ్గర నుంచి నాలుగుతులాల బంగారు ఆభరణాలు, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. కాగా, సీఐ రాజ్‌కుమార్‌గౌడ్‌తో పాటు ఎస్సై బొలగాని సతీశ్, కానిస్టేబుళ్లు రమేశ్, స్వామి, వేణు, మహేశ్, రమ్య, శాంత, డ్రైవర్ సందీప్‌ను డీఎస్పీ అభినందించారు.

సంవత్సరీకానికి వెళ్లొస్తూ మృత్యుఒడికి..

- బైక్ అదుపు తప్పి వ్యక్తి దుర్మరణం



సత్యనారాయణ (ఫైల్)

నెల్లికుదురు: తన బంధువు సంవత్సరీకం కార్యక్రమానికి వెళ్లొస్తూ ఓ వ్యక్తి మృత్యుఒడికి చేరాడు. బైక్ అదుపు తప్పిన ఘటనలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. ఇనుగుర్తి మండలం కోమటిపల్లికి చెందిన ఆరెందుల సత్యనారాయణ (56) బైక్‌పై గార్ల గ్రామంలోని తన బంధువు సంవత్సరీకం కార్యక్రమానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నెల్లికుదురు మండలం బ్రాహ్మణకొత్తపల్లి శివారులో బైక్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని 108లో మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు ఆరెందుల ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సాహిత్య సేవ.. 'నెల్లుట్ల' తోవ

- కవి, రచయిత, కార్టూనిస్ట్‌గా రాణింపు
- కాళోజీ పురస్కారానికి ఎంపికైన నెల్లుట్ల రమాదేవి
- హర్షం వ్యక్తం చేసిన సాహిత్యాభిమానులు



నెల్లుట్ల రమాదేవి

హన్మకొండ కల్చరల్: కవయిత్రి, కథారచయిత్రి, నెల్లుట్ల రమాదేవి ప్రజాకవి కాళోజీ నారాయణరావు పురస్కారానికి ఎంపికవడంతో సాహిత్యాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ శివునిపల్లిలో రామచంద్రరావు, శకుంతలాదేవి దంపతులకు 12 జనవరి 1962లో ఆమె జన్మించారు. 2020లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరంగల్ కలెక్టరేట్ బ్రాంచ్‌లో సీనియర్ మేనేజర్‌గా ఆమె రిటైర్డ్ అయ్యారు. కార్టూన్లు వేయడం, కథలు, కవితలు రాయడం, వ్యాఖ్యానం, సభా నిర్వహణ, ప్రత్యేక సంచికల సంపాదకత్వం, అవసరార్థులకు సాయం చేయడం, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేశారు. 2011లో మనసు భాష (కవిత్వం), రమణీయం కార్టూన్లు, మనసు మనసుకూ మధ్య (కథలు), 2021లో చినుకులు(నానీలు), తల్లివేరు (కథలు), డి.కామేశ్వరిపై కథలు, 2023లో మనోగ్రాఫ్, 2024లో అశ్రువర్ణం (కవిత్వం), రామాయణం (కాలమ్స్)రాసి పలువురి ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు. 2004లో సుశీలా నారాయణరెడ్డి పురస్కారం (కవయిత్రి తొలి సంపుటికి), 2014లో అపురూప అవార్డు (కార్టూన్లకు), 2015 రాష్ట్ర ఆవిర్భావ ప్రథమ వార్షికోత్సవంలో తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ రచయిత్రి (వరంగల్ జిల్లా), 2015లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి కీర్తి పురస్కారం, 2015లో జాతీయ సాహిత్య పరిషత్, సిద్దిపేట వారి ఐతా భారతి చంద్రయ్య సంప్రదాయ కథా సాహితీ పురస్కారం, 2018లో గుర్రం జాషువా ఫౌండేషన్ పురస్కారం, 2019 వెంకటసుబ్బు స్మారక అవార్డు, పర్చా రంగారావు స్మారక అవార్డు, 2021లో తిరుమల స్వరాజ్య లక్ష్మీ సాహితీ పురస్కారం, రాగతి పండరి స్మారక పురస్కారాలు అందుకున్నారు. కార్టూనిస్ట్‌గా బాపు రమణ అకాడమీ వారిచే, ప్రొ.వాసిరెడ్డి భాస్కర్‌రావు స్మారక పురస్కారం, తల్లివేరు సంపుటికి, 2024లో ఎక్స్‌రే పత్రిక ఉత్తమ కవితా పురస్కారం, 2025లో డాక్టర్ రాణి పులోమజాదేవి స్మారక గౌరవ పురస్కారం, డాక్టర్ సినారె సాహిత్య పురస్కారం, అబోపా వరంగల్‌వారి సాహిత్య కళానిధి పురస్కారం, కార్టూన్లకూ, కవిత్వంలోనూ కథలకూ పలు బహుమతులు అందుకున్నారు. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నారు. కొన్ని కాలేజీలు, స్కూళ్లలో విద్యార్థులకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌లో సభ్యురాలిగా, వ్యక్తిగత స్థాయిలోనూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. ఆమె సాహిత్య కృషిని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2025 సంవత్సరానికి కాళోజీ పురస్కారం గ్రహీతగా ఎంపిక చేసింది. పురస్కారానికి ఎంపిక కావడంపై వరంగల్ ఎంపీ కడియం కావ్య శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాహితీ రంగానికి రమాదేవి చేస్తున్న సేవలు అనిర్వచనీయమని కొనియాడారు.

సండే సందడి..

- బొగత వద్ద పర్యాటకుల ఎంజాయ్



బొగత జలపాతం వద్ద పర్యాటకులు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో అధిక సంఖ్యలో తరలొచ్చారు. ఈ సందర్భంగా పాలనురగలా జాలువారుతున్న జలపాతం అందాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం సమీప కొలనులో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. జలపాతం వద్ద సెల్ఫీలీ, ఫొటోలు దిగుతూ ఫిదా అయ్యారు.